
నేటి దినపత్రిక
# సూర్య
www.suryaa.com
ఎన్టీఆర్ కృష్ణా
శుక్రవారం 30 మే 2025 పేజీలు 8




# నమ్మకాన్ని నిలబెట్టండి

- ఎలాంటి ఇబ్బంది లేకుండా సరుకులు పంపిణీ చేయండి
- పండగ వాతావరణంలో జూన్ 1న రేషన్ పంపిణీ ప్రారంభం
- రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్





**ఎన్‌టీఆర్ జిల్లా బ్యూరో, మే 29, మేజర్ న్యూస్ :** రేషన్ దుకాణాల ద్వారా సరుకుల పంపిణీని పునః ప్రారంభించి కార్డుదారులకు నిత్యావసరాలు పంపిణీ చేయాలన్న ప్రభుత్వ నిర్ణయం మేరకు జూన్ 1 నుంచి డీలర్లు రేషన్ దుకాణాల ద్వారా నిత్యావసరాలు పంపిణీ చేసేందుకు పకడ్బందీ ఏర్పాట్లు చేశామని.. రేషన్ డీలర్లు ప్రభుత్వ నమ్మకాన్ని నిలబెట్టి, కార్డుదారులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా సరుకులు పంపిణీ చేయాలని రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రివర్యులు నాదెండ్ల మనోహర్ అన్నారు. జూన్ 1 నుంచి రేషన్ దుకాణాల ద్వారా నిత్యావసర సరుకులు పంపిణీ జరగనున్న నేపథ్యంలో క్షేత్రస్థాయి సన్నద్ధతను పరిశీలించేందుకు మంత్రి నాదెండ్ల మనోహర్ గురువారం విజయవాడ మధురానగర్‌లోని 218 రేషన్ దుకాణం పరిధిలో నిర్వహించిన ట్రయల్ రన్‌ను పరిశీలించారు. అనంతరం విజయవాడ సబ్‌కలెక్టర్ కార్యాలయ ప్రాంగణంలో పౌర సరఫరాల శాఖ ఏర్పాటుచేసిన చౌక ధరల దుకాణాల ఈ-పాస్, వెయింగ్ మెషీన్ సేవా శిబిరాన్ని మంత్రి నాదెండ్ల మనోహర్.. పౌర సరఫరాల కమిషనర్ సౌరభ్ గౌర్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా విజయవాడ డివిజన్ రేషన్ డీలర్లతో ఆయన మాట్లాడుతూ ప్రజా పంపిణీ వ్యవస్థలో ఎలాంటి అవకతవకలకు ఆస్కారం లేకుండా ఉండేందుకు ప్రభుత్వం రేషన్ దుకాణల ద్వారా సరుకుల పంపిణీ చేపట్టనుందని, దివ్యాంగులు, 65 ఏళ్లు పైబడిన వృద్ధులకు ఇంటివద్దే రేషన్ సరుకులు పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. గతంలో కార్డుదారుల కుటుంబాలకు కుటుంబ పెద్దలా ఉన్న రేషన్ డీలర్లు అదేవిధంగా ఇప్పుడు కూడా మనసు పెట్టి పనిచేసి కార్డుదారులకు గౌరవంగా సేవలందించాలన్నారు. ప్రతినెలా ఒకటో తేదీ నుంచి 15వ తేదీ వరకు ఆదివారాల్లో మిగతా 2లో

## యోగాతో
### సంపూర్ణ ఆరోగ్యం



మనస్సు, శరీరం ఏకమై ఆరోగ్య సమస్యలు తొలగిపోయి మానసిక ప్రశాంతత 2

కృష్ణాజిల్లా కలెక్టర్ డీకే బాలాజీ



ఆరోగ్య ఆనంద... 7

## స్వర్ణాంధ్రకు యోగాంధ్ర

లింగాల కాజ్ వే పనులన్నీ

## నాణ్యత లోపమే..!

- కాసులకు కక్కుర్తి పడి కాంట్రాక్టర్లతో ఆర్ & బీ అధికారులు కుమ్మక్కాయ్యారా?
- మార్జిన్ మనీకి ఆశపడి నాణ్యతను పాటించని కాంట్రాక్టర్

వివరాలు 2లో...



(మొదటిపేజీ తరువాయి)



## నమ్మకాన్ని నిలబెట్టండి

సైతం సరుకులు పంపిణీ చేయాలని, అయిదో తేదీలోపే దివ్యాంగులు, 65 ఏళ్లు పైబడి వృద్ధులకు ఇంటివద్దే రేషన్ సరుకులు పంపిణీ చేసేందుకు చొరవచూపాలన్నారు. వాట్సాప్ గ్రూపు ద్వారా ఎప్పటికప్పుడు సమాచారం అందించడం వల్ల, కార్డుదారులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చూడవచ్చున్నారు. ఒకవేళ ఎప్పుడైనా సాంకేతిక సమస్యలు ఎదురైనాసరే కార్డుదారులకు ఇబ్బందిలేకుండా ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా సరుకుల పంపిణీ జరగాల్సిందేనని స్పష్టం చేశారు. గౌరవ ముఖ్యమంత్రివర్యులు, ఉప ముఖ్యమంత్రి ఆకాంక్షలకు అనుగుణంగా ప్రభుత్వానికి మంచిపేరు తెచ్చేలా రేషన్ డీలర్లు పనిచేయాలన్నారు. రేషన్ దుకాణాల పరిసరాలు శుభ్రంగా ఉండేలా చూడటం, సరైన కొలతలతో సరుకులు పంపిణీ చేయడం, ధరలు, స్టాక్ బోర్డులను సరైన విధంగా ఏర్పాటుచేయాలన్నారు. ఈ–పోస్, వెయింగ్ మెషీన్ల రిపేర్లకు సంబంధించి సర్వీసు క్యాంపులు ఏర్పాటు చేయడం జరుగుతోందన్నారు. వీటిని సద్వినియోగం చేసుకుంటూ రేషన్ దుకాణాల ద్వారా సరుకుల పంపిణీకి సర్వసన్నద్ధంగా ఉండాలని మంత్రి సూచించారు. సమావేశంలో విజయవాడ ఆర్డీవో కావూరి చైతన్య, డీఎస్వో ఎ.పాపారావు, ఏఎస్వోలు, పౌర సరఫరాల డీటీలు, రేషన్ డీలర్లు తదితరులు పాల్గొన్నారు.

## యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

**మనస్సు, శరీరం ఏకమై ఆరోగ్య సమస్యలు తొలగిపోయి మానసిక ప్రశాంతత : కృష్ణాజిల్లా కలెక్టర్ డీకే బాలాజీ**



**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** ఆరోగ్యమే మహాభాగ్యం, యోగాతో సంపూర్ణ ఆరోగ్యం పొందవచ్చని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ ప్రజలకు పిలుపునిచ్చారు. గురువారం తెల్లవారుజామునే జిల్లా కలెక్టర్ ఏపీ యోగాసభ ఆధ్వర్యంలో నగరంలోని గాంధీనగర్ వాకర్స్ అసోసియేషన్ హాల్లో యోగ గురువు చింతయ్య నేతృత్వంలో ఏర్పాటు చేసిన యోగా శిక్షణ తరగతుల్లో పాల్గొని సూర్య నమస్కారాలు, యోగాసనాలు, ప్రాణాయామాలు చేశారు. జిల్లా కలెక్టర్ ప్రతిరోజు క్రమం తప్పకుండా ఉదయాన్నే యోగా చేస్తూ స్ఫూర్తిదాయకంగా నిలుస్తున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ యోగా ద్వారా మనస్సు, శరీరము ఏకమై ఆరోగ్య సమస్యలు తొలగిపోయి మానసిక ప్రశాంతత లభిస్తుందన్నారు. ప్రతిరోజు తాను యోగా చేయడం వలన ఎంత ఒత్తిడి ఉన్న సాఫీగా ఉద్యోగ బాధ్యతలు నిర్వహిస్తున్నానన్నారు. వచ్చే జూన్ నెల 21వ తేదీన అంతర్జాతీయ యోగా దినోత్సవంలో పాల్గొనేందుకు వీలుగా ప్రతి ఒక్కరు తమ పేర్లను యోగా యాప్ లో తప్పనిసరిగా నమోదు చేయించుకోవాలన్నారు. ప్రతి ఒక్కరూ యోగ సాధన చేసి ఆరోగ్యంగా ఉండాలని ముఖ్యంగా ఉద్యోగులు ఒత్తిడి లేకుండా విధులు నిర్వహించేందుకు యోగ సాధన ఎంతగానో తోడ్పడుతుందన్నారు. ఏపీ యోగ సభ వారు ఎక్కడా లేనివిధంగా మచిలీపట్నంలో ఐదు కేంద్రాల్లో చింతగుంటపాలెం, గొడుగుపేట, శంకరమఠం, గాంధీనగర్, రెడ్ క్రాస్ భవనంలో ఉచితంగా యోగా శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నారని, ప్రజలందరూ ముఖ్యంగా ఉద్యోగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ కోరారు.

## జర్నలిస్టుల అక్రిడేషన్ కార్డుల గడువు మరో మూడు నెలల పొడిగింపు

**విజయవాడ, మేజర్ న్యూస్ :** రాష్ట్రంలోని జర్నలిస్టుల అక్రిడేషన్ కార్డుల గడువు ముగుస్తున్న నేపథ్యంలో రాష్ట్రంలోని జర్నలిస్టుల అక్రిడేషన్ కార్డుల కాలపరిమితిని మరో మూడు నెలలు పాటు జూన్ 1, 2025 నుండి ఆగష్టు 31, 2025 వరకు లేదా కొత్త కార్డులు జారీ ప్రక్రియ చేయడం గానీ ఏది ముందు జరిగితే అప్పటివరకు పొడిగింపు ఉత్తర్వులు జారీ చేసినట్లు సమాచార పౌర సంబంధాల శాఖ సంచాలకులు హిమాన్షు శుక్ల గురువారం ఆదేశాలు జారీ చేశారు. ప్రస్తుతం మే 31 నాటికి అక్రిడిటేషన్ కార్డులు పనిచేస్తున్న పాత్రికేయులకు మాత్రమే మరో మూడు నెలలు జూన్ 1, 2025 నుండి ఆగష్టు 31, 2025 వరకు ఈ పొడిగింపు సౌకర్యం వర్తిస్తుందని ఆ ప్రకటనలో సమాచార పౌర సంబంధాల శాఖ సంచాలకులు హిమాన్షు శుక్ల తెలియజేశారు.

# లింగాల కాజ్ వే పనులన్నీ నాణ్యత లోపమే..!





**కాసులకు కక్కుర్తి పడి కాంట్రాక్టర్లతో**

**ఆర్ & బీ అధికారులు కుమ్మక్కయ్యారా?**

**మార్జిన్ మనీకి ఆశపడి నాణ్యతను పాటించని కాంట్రాక్టర్**

**వత్సవాయి మే 29 మేజర్ న్యూస్ :** జగ్గయ్యపేట నుండి వైరా వెళ్లే జాతీయ రహదారికి లింగాల మున్నేటిపై ఉన్న బ్రిడ్జి (కాజ్ వే) గతంలో కురిసిన భారీ వర్షాలకు పాడైపోయి ప్రజలు పడ్డ అవస్థలు వర్ణనాతీతం. స్థానిక శాసన సభ్యులు శ్రీరాం రాజగోపాల్ చొరవతో ప్రభుత్వం కాజ్ వే నిర్మాణ పనులకు కోట్ల రూపాయల నిధులను కేటాయించడం జరిగింది. నిత్యం రాకపోకలతో రద్దీగా ఉండే ఈ మున్నేటి బ్రిడ్జి మరమతుల పనులు నాణ్యత లోపంగా జరుగుతున్నాయని ప్రజల ఆరోపిస్తున్నారు. ఎందుకంటే ఈ బ్రిడ్జి నిర్మాణానికి ఉపయోగించే సిమెంటు ఇనుము నాసిరకం గా ఉన్నాయని కోట్ల రూపాయల ఖర్చు పెట్టి నిర్మించే ఇలాంటి బ్రిడ్జినే నాచిరకంగా తయారు చేస్తే భవిష్యత్తులో ప్రజలు తీవ్రంగా ఇబ్బందులు పడక తప్పదని అంటున్నారు. కాంట్రాక్టర్లు ఇచ్చే కాసులకు కక్కుర్తి పడి అధికారులు ఇలాంటి నాసిరకం పనులు జరుగుతున్న చూచి చూడనట్లు వ్యవహరిస్తున్నట్లు తెలుస్తుంది. స్థానిక అధికారులు పర్యవేక్షణ లేకపోవడంతో కాంట్రాక్టర్ తను ఇష్టానుసారంగా వ్యవహరించడం జరుగుతుందని వాహనదారులు చర్చించుకుంటున్నారు. ఎక్కువ మార్జిన్ మనీ కి ఆశపడి కాంట్రాక్టర్ మున్నేటిలోనే ఇసుక అందుబాటులో ఉండడంతో కాంక్రీట్ తయారు విషయంలో ఇసుకను ఎక్కువ సిమెంటు తక్కువ నాచిరకం ఇనుము వాడుతున్నారని దీనివలన కాంట్రాక్టర్ కు ఎక్కువ మార్జిన్ మనీ మిగులుతుందని అందువలనే కాంట్రాక్టర్ తన ఇష్టానుసారంగా మున్నేటి బ్రిడ్జి మరమత్తుల పనులు చేపట్టడం జరుగుతుందని అంటున్నారు. స్థానిక ఆర్ అండ్ బి కార్యాలయంలో ఎ ఇ, తగిన సిబ్బంది లేకపోవడంతో డి ఇ ఇ ద్విపాత్రాభినయం చేస్తున్నాడు.

నేనే మంత్రి నేనే రాజు అనే విధంగా డి ఇ ఇ తీరు ఉంది. అన్ని తానై కాంట్రాక్టర్‌తో కుమ్మకై కోట్ల రూపాయలు ఖర్చుతో నిర్మిస్తున్న బ్రిడ్జి నిర్మాణ పనులను పర్యవేక్షించకుండా తన సొంత ప్రయోజనాల కోసం పని చేస్తున్న అధికారులపై తగిన చర్యలు తీసుకోవాలని కొందరు ఉన్నతాధికారులకు ఫిర్యాదులు చేస్తున్నట్లు వినికిడి. గనుక ఇప్పటికైనా సంబంధిత జిల్లా అధికారులు ఎక్కువ రద్దీగా ఉండే మునేటి బ్రిడ్జి పనుల నాణ్యతను పరిశీలించి నాణ్యత లోపంగా నిర్మించిన కాంట్రాక్టర్ పై అతనికి సహకరించిన ప్రభుత్వ అధికారులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఈ ప్రాంత ప్రజలు కోరుతున్నారు.

## కెనోయ్ ఛాంపియన్ షిప్‌లో కాంస్య పతక విజేత గొలుగూరి వర్షితను అభినందించిన సీపీ



**విజయవాడ క్రైం, మేజర్ న్యూస్:** గత నెల 24 నుంచి 28 వరకు బోపాల్‌లోని లోయర్ లేక్ వేదికగా జరిగిన 35వ జాతీయ కెనోయ్ స్ప్రింట్ చాం పియన్ షిప్ లో కంస్య పతకం సాధించిన అథ్లెటిక్ గొలుగూరి వర్షితను పోలీస్ కమిషనర్ రాజ శేఖర్ బాబు అభినందించారు. పదమట ఎన్ ఎస్ ఎం పబ్లిక్ స్కూల్ లో ఎనిమిదవ తరగతి చదువుతున్నట్లు, కెనోయ్ ఈవెంట్ లో జాతీయ స్థాయిలో ఆంధ్రప్రదేశ్ నుండి వర్షిత ఒక్కర్తే ఎంపిక అయినట్లు, బోపాల్‌లో జరిగిన 35వ జాతీయ కెనోయ్ స్ప్రింట్ చాంపియన్ షిప్‌లో సబ్ జూనియర్ కె4 500మీ.ల విభాగంలో ఒడిశా జట్టుకు ప్రాతినిధ్య వహించి తృతీయ స్థానం సాధించినట్లు వివరించగా, వర్షిత చదువుల్లో, అథ్లెటిగ్గా రాణించి భవిష్యత్తులో అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు సాధించాలని పోలీస్ కమిషనర్ రాజశేఖర్ బాబు ఆకాంక్షించారు.

# నూతన సాంకేతికతను సద్వినియోగం చేసుకోవాలి





**అవనిగడ్డ మేజర్ న్యూస్:** రైతులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న నూతన సాంకేతికతను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ సూచించారు. గురువారం అవనిగడ్డ మండలం వేకనూరులో వికసిత్ కృషి సంకల్ప అభియాన్ సభ జరిగింది. ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలపై రైతులకు అవగాహన కలిగించేందుకు ఏర్పాటు చేసిన ఈ సదస్సులు ప్రయోజనకరం అన్నారు. వ్యవసాయంలో సాగు వ్యయం తగ్గించాలనే లక్ష్యంతో ప్రభుత్వం తగిన సహకారం అందిస్తోందన్నారు. యాభై శాతం సబ్సిడీ వ్యవసాయ యంత్ర పరికరాలు అందిస్తోందన్నారు. డ్రోన్ టెక్నాలజీ ద్వారా వ్యవసాయాన్ని సులభతరం చేసేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. ఇందుకోసం రైతులకు ప్రభుత్వం రాయితీపై డ్రోన్లు అందిస్తోందన్నారు. రోజురోజుకు పురోగతి సాధిస్తున్న శాస్త్ర సాంకేతిక రంగాల ప్రగతితో రైతులకు మేలు కలుగుతోందన్నారు. గత వైసీపీ ప్రభుత్వం రైతులకు పెట్టిన ధాన్యం సొమ్ము బకాయి కూటమి ప్రభుత్వం తీర్చటంతో పాటు, ధాన్యం విక్రయించిన 24గంటల్లో సొమ్ము రైతుల బ్యాంకు ఖాతాలకు జమ చేసిన ఘనత కూటమి ప్రభుత్వానికే దక్కిందన్నారు. మార్కెట్లో డిమాండ్ ఉన్న పంటలు సాగు చేసేలా రైతులను ప్రోత్సహించాలని, ఔషధ మొక్కలు, ఆయిల్ పామ్ పంటల సాగు విస్తీర్ణం పెరగాలని భారతదేశ మాజీ ప్రధాన మంత్రి పీవీ నరసింహారావు ఆకాంక్షించే వారని తెలిపారు. కూటమి ప్రభుత్వం ఆయిల్ పామ్ పంటకు విస్తృత ప్రోత్సాహం అందిస్తోందన్నారు. కృష్ణాడెల్టా ఉద్యమంతో డెల్టా సమస్యలు ప్రభుత్వం గమనించి పులిచింతల ప్రాజెక్టు, పట్టిసీమ ప్రాజెక్టు నిర్మించినా పోలవరం ప్రాజెక్టు నిర్మాణంతోనే శాశ్వత పరిష్కారం సాధ్యం అన్నారు. కూటమి ప్రభుత్వం పోలవరం ప్రాజెక్టు నిర్మాణం పూర్తి చేసేందుకు కృత నిశ్చయంతో పని చేస్తోందన్నారు. ఏడాది క్రితం తాను ఎన్నికల్లో గెలిచిన వెంటనే ఇరిగేషన్, డ్రైనేజి శాఖల అధికారులతో చర్చించి నియోజకవర్గంలోని పంట కాలువలు, మురుగు కాలువల సమస్యలు రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి యుద్ధప్రాతిపదికన తూటికాడ, గుర్రపు డెక్క తొలగించి సాగుకు అనుకూల పరిస్థితి కల్పించినట్లు తెలిపారు. తాజాగా రానున్న సీజనుకు అనుగుణంగా ప్రభుత్వం ద్వారా నిధులు సాధించి పనులు చేపట్టినట్లు తెలిపారు. ప్రభుత్వం మంజూరు చేసిన నిధులను సాగు నీటి సంఘాల వారు సద్వినియోగం చేసుకుని రైతులకు మేలు చేయాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా రైతులకు విత్తనాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆచార్య ఎన్.జి.రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం విస్తరణ సంచాలకులు డాక్టర్ జి.శివన్నారాయణ, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి మనోహర్, ఘంటసాల కృషి విజ్ఞాన కేంద్రం సమన్వయకర్త డాక్టర్ సుధారాణి, ఎంపీడీవో మరియాదేవి, గ్రామ సర్పంచ్ తుంగల శ్రీలక్ష్మి, ఏడీఏ జయప్రద, ఉద్యానవన శాఖ అధికారి ఎన్.రమేష్, ఏఓ వి.శౌరమ్మ, కేవీకే శాస్త్రవేత్తలు మంజువాణి, రేవతి, పంచాయతీ కార్యదర్శి రోహిత్, వీఏఏ పవన్, టీసీ అధ్యక్షులు భోగాది రాజకుమార్, ఐసీఏఆర్, యూనివర్సిటీ శాస్త్రవేత్తలు, రైతులు, గ్రామస్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వ్యవసాయ డ్రోన్ ప్రదర్శన ఏర్పాటు చేయగా ఎమ్మెల్యే సందర్శించారు. అధికారులు డ్రోన్ ప్రయోజనాలు రైతులకు వివరించారు.

# రేషన్ దుకాణాల నుండి సరుకుల పంపిణీ చేసేందుకు సిద్ధం చేయండి



విజయవాడ మే 29, మేజర్ న్యూస్ : మండల లెవల్ స్టాక్ పాయింట్ నుండి (ఎంఎల్ఎస్) నుండి రేపటిలోగా నిత్యావసర సరుకుల పంపిణీ పూర్తి చేసి రేషన్ దుకాణాల నుండి సరుకుల పంపిణీ చేసేందుకు సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ డా. జి. లక్ష్మీశ సంబంధిత అధికారులను ఆదేశించారు. జూన్ 1వ తేదీ నుండి రేషన్ దుకాణాల ద్వారా నిత్యావసర సరుకుల పంపిణీ పున:ప్రారంభం నేపథ్యంలో గురువారం విజయవాడ రూరల్ గొల్లపూడి ఎంఎల్ఎస్ పాయింట్ వద్ద సరుకుల లోడింగ్ ప్రక్రియను జిల్లా కలెక్టర్ డా. జి. లక్ష్మీశ ఆకస్మికంగా తనిఖీ చేశారు. గొల్లపూడి ఎంఎల్ఎస్ పాయింట్ గోదాములో ఉన్న నిత్యావసర సరుకులను పరిశీలించి, ఎంఎల్ఎస్ పాయింట్ నుంచి చౌక ధరల దుకాణాలకు సరుకుల పంపిణీ, రవాణా ఛార్జీలు, హమాలీలకు చెల్లింపులు తదితర వివరాలను అధికారుల నుండి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో విజయవాడ, మైలవరం, నందిగామ, కంచికచర్ల, జగ్గయ్యపేట, తిరువూరు, విసన్నపేట, ఎంఎల్ఎస్ పాయింట్ల పరిధిలో 957 రేషన్ దుకాణాల ద్వారా సుమారు 8,929 టన్నుల బియ్యాన్ని, సుమారు 260 టన్నుల పంచదార కార్డుదారులకు పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. జిల్లాలో జూన్ 1వ తేదీ నుండి రేషన్ దుకాణాల ద్వారా పారదర్శకంగా కార్డు దారులకు నిత్యావసర సరుకుల పంపిణీని పున:ప్రారంభించిందన్నారు. ఇప్పటికే రేషన్ దుకాణాల డీలర్లు, అసోసియేషన్ ప్రతినిధులు, పౌర సరఫరాల అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించడం జరిగిందన్నారు. రేషన్ దుకాణాల ద్వారా ఉదయం 8 గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు సాయంత్రం 4 గంటల నుండి 8 గంటల వరకు రేషన్ పంపిణీకి చర్యలు తీసుకునేలా ఆదేశించామన్నారు. దివ్యాంగులు, 65 సంవత్సరాల పైబడిన వృద్ధులకు ఇంటి వద్ద రేషన్ సరుకులు పంపిణీకి చర్యలు తీసుకున్నామన్నారు. ఎంఎల్ఎస్ పాయింట్ గోదాము నుండి రేషన్ దుకాణాలకు సరుకుల పంపిణీలో ఎటువంటి అవకతవకలకు పాల్పడిన తక్షణమే కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ హెచ్చరించారు. తనిఖీలో కలెక్టర్ వెంట డిఆర్వో ఎం. లక్ష్మీనరసింహం సంబంధిత అధికారులు ఉన్నారు.

## కే అశ్విని ఆధ్వర్యంలో యోగ క్లాస్లులు నిర్వహణ



జగ్గయ్యపేట/ చిల్లకల్లు, మే 28 మేజర్ న్యూస్ : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా చిల్లకల్లు, వేదాద్రి, గండ్రాయి బండిపాలెం గ్రామ పంచాయతీలలో యోగా మాస్టర్ ట్రైనర్ కె.అశ్విని ఆధ్వర్యం లో యోగా క్లాసులు గురువారం నిర్వహించటము జరిగినది.యోగా మాస్టర్ ట్రైనర్ కె.అశ్విని వివిధ రకముల ఆసనములు, యోగా నేర్పిస్తూ శిక్షణ ఇవ్వటము జరిగినది. ఈకార్యక్రమములో మండల పరిషత్ అభివృద్ధి అధికారి జి. నితిన్ పంచాయతీ కార్యదర్శులు బాణావతి. జగ్గయ్య, ఎ. శేఖర్ శివాజీ, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఆరోగ్యకర సమాజాన్ని నెలకొల్పుదాం



మచిలీపట్నం మేజర్ న్యూస్ : యోగాంధ్ర 2025 లో భాగంగా ఈరోజు ఉదయం మచిలీపట్నం స్విమ్మింగ్ పూల్ ప్రాంగణంలో చిన్నారులకు కృష్ణా జిల్లా స్పోర్ట్స్ అథారిటీ వారు యోగ శిక్షణ కార్యక్రమం నిర్వహించారు.ఎపి యోగ సభ ఆధ్వర్యంలో యోగా గురువు శీలం రమేష్, కృష్ణాజిల్లా క్రీడల అభివృద్ధి అధికారి కె.ఝాన్సీలక్ష్మీ సంయుక్తంగా చిన్నారులకు, వారి తల్లిదండ్రులకు యోగాసనాలు, ప్రాణాయామాలలో శిక్షణ ఇచ్చారు.ఈ శిక్షణ తరగతుల్లో కబడ్డీ కోచ్ కళ్యాణీ, జిమ్ ట్రైనర్ అయ్యప్ప, స్విమ్మింగ్ కోచ్ అజయ్ కూడా పాల్గొన్నారు.

# విద్యార్థులు భయాన్ని వదిలి ధైర్యంతో ముందుకు సాగాలి



మచిలీపట్నం మేజర్ న్యూస్ : విద్యార్థులు భయాన్ని వదిలి ధైర్యంతో ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలని సబ్ జైలు సూపరింటెండెంట్ పి రమేష్ బాలబాలికలకు ఉద్బోధించారు. స్థానిక 45వ డివిజన్ ఈడేపల్లి శాఖ గ్రంథాలయంలో గ్రంథాలయ నిర్వాహకురాలు కోన వెంకటేశ్వరమ్మ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వేసవి శిక్షణ తరగతుల కార్యక్రమాన్ని గురువారం మచిలీపట్నం సబ్ జైల్ సూపరింటెండెంట్ పి. రమేష్ పర్యవేక్షించి విద్యార్థులతో ముచ్చటించారు. వేసవి సెలవులలో శిక్షణ ద్వారా విద్యార్థినీ విద్యార్థులకు జ్ఞాన వృద్ధితో బాటుగా కొంగొత్త విషయాలు నేర్చుకునే అవకాశం కలుగుతుందన్నారు. వేసవి శిక్షణా తరగతుల ద్వారా పిల్లలు వారి స్నేహితులతో మమేకమై, కొత్త స్నేహితులను ఏర్పరచుకుని సామాజిక నైపుణ్యాలు అభివృద్ధి చేసుకోవచ్చన్నారు. వేసవి సెలవులలో శిక్షణ ద్వారా ఆరోగ్యకరమైన జీవనం మెరుగుపడుతుందన్నారు. సమ్మర్ క్యాంపులో నేర్పించే చిత్రలేఖనం, హ్యాండ్ రైటింగ్, కరాటే, కూచిపూడి నృత్యం వంటివి బాలల సృజనాత్మకతకు దోహదపడుతుందన్నారు. వేసవి శిక్షణ తరగతుల క్యాంపును పర్యవేక్షించడానికి విచ్చేసిన సబ్ జైల్ సూపరింటెండెంట్ పి రమేష్‌ను 45వ డివిజన్ టిడిపి ఇన్చార్జ్ పి. వి. ఫణి కుమార్, ఈడేపల్లి శాఖ గ్రంథాలయ నిర్వాహకురాలు కోన వెంకటేశ్వరమ్మలు ఘనంగా సత్కరించారు. ఉపాధ్యాయులు శేషగిరిరావు, సాంబశివరావు, లాల్ బహదూర్, కేశవ, రవీంద్రలు పాల్గొన్నారు.



## డెట్టాల్ బ్రాండ్ అంబాసిడర్‌గా కెప్టెన్ కూల్ ఎంఎస్‌ధోనీ




విజయవాడ మేజర్ న్యూస్ : క్రికెట్ దిగ్గజం, భారతదేశపు ఒరిజినల్ కెప్టెన్ కూల్ మహేంద్ర సింగ్ ధోనీని తమ డెట్టాల్ సబ్బులు, బాడీవాష్, హ్యాండ్ వాష్ శ్రేణి కోసం బ్రాండ్ అంబాసిడర్‌గా ప్రముఖ బ్రాండ్ డెట్టాల్ ప్రకటించింది. మొదటిసారిగా చేస్తున్న ఈ సహకారం గొప్ప కూల్ దిగ్గజాన్ని, నమ్మకమైన కూల్ బ్రాండ్‌ను ఒక చోటకు తెచ్చింది. ఈ బంధంపై మహేంద్ర సింగ్ ధోనీ మాట్లాడుతూ, డెట్టాల్ వారి కొత్త కాంపైన్ డెట్టాల్ ఐసీ కూల్ కోసం డెట్టాల్ తో జతకట్టడం ఎంతో ఉత్సాహంగా ఉందని అన్నారు. డెట్టాల్ ఐసీకూల్ కూల్ గా ఉండటానికి పరిపూర్ణమైన పరిష్కారం అందిస్తుందని పేర్కొన్నారు.

## దక్షిణ భారతదేశానికి విస్తరించిన శామ్సంగ్ సాల్వ్ ఫర్ టుమారో సీజన్ 4




విజయవాడ మేజర్ న్యూస్ : శామ్సంగ్ 'సాల్వ్ ఫర్ టుమారో' సీజన్ 4 దక్షిణ భారతదేశానికి విస్తరించింది. ఈ కార్యక్రమం యువత ఆధారిత ఆవిష్కరణలకు దోహదపడుతూ, సామాజిక ప్రభావాన్ని కలిగించే పరిష్కారాలను ప్రోత్సహిస్తోంది. హైదరాబాద్లోని ప్రగతిశీల విద్యాసంస్థల్లో, బెంగళూరులోని ప్రముఖ టెక్నాలజీ కేంద్రాలలో, విద్యార్థులు సానుభూతి, ప్రయోజనం, డిజైన్ థింకింగ్ సూత్రాల ఆధారంగా స్థానిక సమస్యలకు వినూత్న పరిష్కారాలను రూపొందించేందుకు ముందుకొస్తున్నారు. హైదరాబాద్ విశ్వవిద్యాలయంలో నిర్వహించిన 'సాల్వ్ ఫర్ టుమారో' రోడ్ షో సందర్భంగా, వందలాది మంది విద్యార్థులు డిజైన్ థింకింగ్ వర్క్ షాప్ లో పాల్గొని, ప్రస్తుత పరిస్థితులను ప్రశ్నిస్తూ, ప్రాథమిక జీవితంలో ఎదురయ్యే సమస్యలకు సృజనాత్మక పరిష్కారాలను కనుగొన్నారు.

## ఖరీఫ్ సాగుపై రైతులకు అవగాహన

మొవ్వ మే 29 మేజర్ న్యూస్: వికసిత్ కృషి సంకల్ప అభియాన్‌లో భాగంగా ఘంటసాల కృషి విజ్ఞాన కేంద్రం, మొవ్వ మండల వ్యవసాయ శాఖ సంయుక్త ఆధ్వర్యంలో ఈనెల 30వ తేదీ శుక్రవారం మండల కేంద్రమైన మొవ్వ శ్రీ క్షేత్రయ్య కళ్యాణ మండపంలో ఖరీఫ్ వ్యవసాయ సాగుపై రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించినట్లు మండల వ్యవసాయాధికారి కే. శివప్రసాద్ తెలిపారు. ఖరీఫ్ వ్యవసాయ సాగులో అవలంబించవలసిన యాజమాన్య పద్ధతులు, నూతన సాంకేతిక పరిజ్ఞానంతో ఖరీఫ్ సాగు విధానం పై కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు రైతులకు అవగాహన కల్పిస్తారని తెలిపారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగపరచుకోవాలని ఏవో శివప్రసాద్ తెలిపారు.

Roc.No.832/2022/A1,

పురపాలక సంఘ కార్యాలయము,
జగ్గయ్యపేట. ది. 28.05.2025.

**బహిరంగ వేలం ప్రకటన**

జగ్గయ్యపేట పురపాలక సంఘమునకు చెందిన మొదలగు మునిసిపల్ షాపింగ్ కాంప్లెక్స్ నందలి షాపుల బహిరంగ వేలము ద్వారా లీజుకు ఇచ్చు నిమిత్తం పురపాలక సంఘ కార్యాలయ ఆవరణంలో కమిషనర్ గారిచే ది:06.06.2025 ఉదయం 11:00 గంటలకు నిర్వహించబడునని తెలియజేయడమైనది. బహిరంగ వేలములో పాల్గొను వారు ఈ దిగువ నిబంధనలకు లోబడి పాల్గొనవలెను.

| వ.నెం. | వేలము పాట వివరములు | వేలం ధరావత్తు | సాల్వేన్సీ విలువ |
|---|---|---|---|
| 1 | 2 | 3 | 4 |
| 1 | IDSMT Municipal Shopping Complex First Floor Shop No.16, Second Floor Shop No.24 | Rs.1,00,000/- | Rs.3,00,000/- మరియు 15 సం.ల EC దాఖలు పరచవలెను... |
| 2 | Dwacra Municipal Shopping Complex Shop Nos: 4 & 7 | Rs.40,000/- | Rs.2,00,000/- మరియు 15 సం.ల EC దాఖలు పరచవలెను... |
| 3 | Samineni Udayabhanu Municipal Shopping Complex First Floor Shop No.5 | Rs.50,000/- | Rs.2,00,000/- మరియు 15 సం.ల EC దాఖలు పరచవలెను... |



## స్వర్ణాంధ్ర 2047 విజన్‌కు అనుగుణంగా వ్యవహరించాలి

**నందిగామ, మే 28, మేజర్ న్యూస్ :** స్వర్ణాంధ్ర 2047 విజన్‌కు అనుగుణంగా హోటళ్లు, లాడ్జిలు, హోమ్ స్టే, ధర్మ సత్రాలలో నిర్వహణ ఉండాలని నందిగామ ఆర్డీవో కె బాలకృష్ణ యజమానులకు స్పష్టం చేశారు. గ్రీన్ లీఫ్ రేటింగ్ స్వర్ణాంధ్ర లక్ష్యాలను సాధించడంతో ఆతిథ్య రంగం కూడా కీలకంగా ఉన్నందున ప్రభుత్వ ఆదేశాల మేరకు రానున్న కాలంలో హోటళ్లు, లాడ్జిలు, హోమ్ స్టేలు, ధర్మ సత్రాలలో నిర్వహణలో పాటించాల్సిన నిబంధనలను వివరించారు. నందిగామ రెవెన్యూ డివిజనల్ అధికారి వారి కార్యాలయంలో డివిజన్లోని సదరు యజమానులకు నిర్వహించిన అవగాహన సదస్సులో సురక్షితమైన పారిశుద్ధ్య సౌకర్యాల నిర్వహణ కచ్చితంగా అమలు చేయాలన్నారు. ఆహార నాణ్యత, తాగునీరు, వ్యర్థనీరు, చెత్త నిర్వహణ, ప్లాస్టిక్ వినియోగం నిషేధం తదితర అంశాలపై వివరించారు.ఆర్ డబ్ల్యూఎస్ డీఈ నందిగామ, జగ్గయ్యపేట, నందిగామ డివిజన్‌లోగల ఎంపీడీవోలు పాల్గొన్నారు.

## యుద్ధ వాతావరణ పెరగడానికి పాలకుల తీరే కారణం



**గన్నవరం, మే 29, మేజర్ న్యూస్ :** దేశంలో మతసామరస్యం వర్ధిల్లాలని కోరుతూ గురువారం గన్నవరంలో సిపిఎం ఆధ్వర్యంలో సమైక్యత ర్యాలీ నిర్వహించారు. గాంధీ బొమ్మ సెంటర్లో ఉగ్రవాదం, యుద్ధోన్మా దానికి వ్యతిరేకంగా నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కళ్లం వెంకటేశ్వరరావు, టీవీ లక్ష్మణ స్వామి మాట్లాడుతూ.. దేశంలో యుద్ధ వాతావరణ పెరగడానికి పాలకుల తీరే కారణమన్నారు. ప్రజలంతా శాంతి సామరస్యాలతో జీవనం సాగించాల్సిన అవసరం ఉందన్నారు. మత సామరస్యం కాపాడుకునేందుకు ప్రతి ఒక్కరూ పాటుపడాలన్నారు. సమగ్రత, సమైక్యతను కాపాడుకునేందుకు మేధావులు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు మల్లంపల్లి ఆంజనేయులు, మీరా ఖాన్, అజ్మీర వెంకటేశ్వరరావు, తాతబ్బాయి తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు వేసవి శిక్షణా తరగతులు



**తిరువూరు మేజర్ న్యూస్ :** స్థానిక ప్రథమశ్రేణి గ్రంథాలయంలో లైబ్రేరియన్ పద్మావతి ఆధ్వర్యంలో గురువారం విద్యార్థులకు వేసవి శిక్షణా తరగతులు నిర్వహించారు. విద్యార్థులతో పుస్తకాలు చదివించటం, చదివిన పుస్తకంలోని కథలు వారితో చెప్పించటం, పలు జి కె ప్రశ్నలు అడిగి విద్యార్థులతో సమాధానాలు చేపించారు, ఇంగ్లీష్‌లో గ్రామర్ టెస్ట్ నిర్వహించారు. విద్యార్థులతో మెడిటేషన్, యోగా చేయించారు.

## ఉంద్రపూడి ఆంజనేయస్వామి హుండీ లెక్కింపు



**పామర్రు మే 29 మేజర్ న్యూస్ :** పామర్రు మండల పరిధిలోని ఉంద్రపూడి – పోలవరం అడ్డరోడ్డు వద్ద గల శ్రీ వీరాంజనేయ స్వామి దేవస్థానంలో గురువారం హుండీల లెక్కింపు నిర్వహించారు. కొత్తపేట శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి దేవస్థాన కార్యనిర్వహణాధికారి ఎస్.వి.సుబ్బారావు పర్యవేక్షణలో హుండీల లెక్కింపు జరిగింది. ఈ లెక్కింపులో 7 లక్షల34వేల 410 రూపాయలు ఆదాయం లభించినట్లు ఆలయ కార్యనిర్వాహణాధికారి పి.వి.ఎన్.వి.ప్రసాదరావు తెలిపారు. ఈ లెక్కింపు కార్యక్రమంలో ఆలయ ఉత్సవ కమిటీ మాజీ సభ్యులు మట్టా వెంకటేశ్వరరావు, వెన్నా శ్రీనివాసరావు, ఈడే గంటేశ్వరరావు, దాడి పవన్ కుమార్, కూనపరెడ్డి సుబ్బారావు, సేవా కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# విలేఖరి శ్రీనివాసరావుకి నిత్యవసర సరుకులు అందజేత



**నందిగామ, మే 29, మేజర్ న్యూస్:** చందర్లపాడు ఓ ప్రముఖ పత్రిక విలేఖరి అరిగెల శ్రీనివాసరావు ఆరోగ్యం బాగా లేకపోవడంతో విజయవాడ ఆసుపత్రిలో చికిత్సపొంది ఇంట్లో విశ్రాంతి తీసుకుంటున్న శ్రీనివాసరావును ది న్యూ ఇండియన్ జర్నలిస్ట్ వెల్ఫేర్ అసోసియేషన్ జాతీయ ఉపాధ్యక్షులు, అసోసియేషన్ అఫ్ ప్రింట్ అండ్ బ్రాడ్ కాస్టింగ్ జర్నలిస్ట్స్ సంఘ వ్యవస్థాపక అధ్యక్షులు పి.మీరాహుస్సేన్ ఖాన్,ఎపిడబ్లుజేఎఫ్ నాయకులు ఆకుల వెంకట నారాయణ,ఏ శ్రీనివాసరావు, ఖుద్దుస్ తదితరులు పరామర్శించారు. అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా జర్నలిస్టులు శ్రీనివాసరావుకు బియ్యం,నిత్యవసర సరుకులు, కూరగాయలు, పండ్లు అందజేశారు. శ్రీనివాసరావు ఆరోగ్య పరిస్థితిని వాట్సప్ గ్రూప్ ద్వారా తెలుసుకున్న మంగళగిరి మాజీ ఎంఎల్ఏ ఆళ్ళ రామకృష్ణారెడ్డి చలించిపోయి 50,000 అందజేశారు. మంగళగిరి మాజీ ఎంఎల్ఏ ఆళ్ళ రామకృష్ణారెడ్డి కి,శ్రీనివాసరావు కుటుంబ సభ్యులు, పలువురు జర్నలిస్టు సంఘ నాయకులు, శ్రీనివాసరావు కృతజ్ఞతలు తెలిపారు. ఇబ్బందుల్లో ఉన్న జర్నలిస్టు లకు చేయూ త అదిస్తున్న మంగళగిరి ఎంఎల్ఏ ఆళ్ళ రామకృష్ణారెడ్డికి ది న్యూ ఇండియన్ జర్నలిస్ట్ వెల్ఫేర్ అసోసియేషన్ జాతీయ ఉపాధ్యక్షులు మీరాహుస్సేన్ ఖాన్, ఎపిడబ్లుజేఎఫ్ నాయకులు ఆకుల నారాయణ ధన్యవాదాలు తెలిపారు.ఆళ్ళ కష్టాల్లో ఉన్న జర్నలిస్టులను అదుకోవడంతో మనున్న మహారాజు ఆళ్ళ అని పలువురు ప్రశంసిస్తున్నారు.ఈ సందర్భంగా మీరాహుస్సేన్ ఖాన్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం జర్నలిస్టుల సమస్యలు పరిష్కారానికి కృషి చేయాలని కోరారు.

## అగినపర్రు ఉన్నత పాఠశాలకు ప్రింటర్ బహుకరణ



**పమిడిముక్కల మే 29 మేజర్ న్యూస్:** మండల పరిధిలోని అగినపర్రు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థి, పూర్వ ఉపాధ్యాయుడు తమ్మన వేణుగోపాలరావు 12వేలు రూపాయల విలువగల ప్రింటర్ ను ఆ పాఠశాలకు బహుకరించారు. పాఠశాల పూర్వపు సిబ్బంది కార్యదర్శి, విశ్రాంత సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయులు జనాబ్ మిర్జా అబుసిబ్తైన్ సాహెబ్ సమక్షంలో, పాఠశాల ఇన్చార్జి ప్రధానోపాధ్యాయులు ఎస్.వి.ఎస్.ఎస్. ఫణి కుమార్ కు అందించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఫణి కుమార్ మాట్లాడుతూ దాత వేణుగోపాలరావును అభినందించారు. పాఠశాల విద్యా కుటుంబం అందరి తరపున ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు. పాఠశాల పూర్వపు సిబ్బంది కార్యదర్శి జనాబ్ మిర్జా అబుసిబ్తైన్ సాహెబ్ మాట్లాడుతూ పాఠశాలకు ప్రింటర్ బహూకరించిన దాత వేణుగోపాలరావు తాను చదువుకున్న ఉపాధ్యాయుడిగా పని చేసిన పాఠశాల మీద అభిమానంతో పాఠశాలకు తన వంతు సహకారం అందించాలని ఆలోచించి, పాఠశాలకు అవసరమైన ప్రింటర్‌ను బహుకరించడం హర్షించదగ్గ విషయమన్నారు. పాఠశాల పూర్వ విద్యార్థులందరూ కూడా ఒక గొప్ప స్థాయికి ఎదిగిన తర్వాత, తమకు ఉన్నంతలో తాము చదువుకున్న పాఠశాల అభివృద్ధి కోసం తమ వంతు కృషి చేయాలని, పాఠశాలకు తమ వంతు సహకారం అందించాలని, పాఠశాల అన్ని రంగాలలో అభివృద్ధి సాధించేందుకు తమ వంతు తోడ్పాటు అందించాలని ఆకాంక్షించారు.



## సబ్సిడీపై విత్తనాల పంపిణీ

**రెడ్డిగూడెం, మే 29 మేజర్ న్యూస్:** రైతన్న భూమిని బంగారు భూమిగా మార్చాలన్న సంకల్పంతో తెలుగు దేశం, జనసేన, బీజేపీ కూటమి ప్రభుత్వం ముందడుగు వేసిందని,భూసారాన్ని పెంపొందించి దిగుబడులు మెరుగుపరచాలన్న దృష్టితో, కూటమి ప్రభుత్వం 50% సబ్సిడీ పథకం కింద నాణ్యమైన పచ్చిరొట్ట విత్తనాల పంపిణీ వ్యవసాయ కార్యాలయంలో గురువారం టిడిపి మండల అధ్యక్షులు ముప్పిడి నాగేశ్వర రెడ్డి ప్రారంభించారు. ఈ పథకం కింద జనుములు (10 కేజీలు) రూ.550కు, పిల్లి మిసర్లు (8 కేజీలు) రూ.720కు, రైతులకు అందుబాటులో విత్తనాలు ఉన్నాయని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతు నమ్మకాన్ని నిలబెట్టుకోవడం మా ప్రభుత్వ తొలి కర్తవ్యం. భూసారాన్ని పెంచితే పంటల లాభం పెరుగుతుంది. ఇదే లక్ష్యంతో కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఈ పథకాన్ని గ్రామ స్థాయికి తీసుకొచ్చి ప్రతి రైతు భూమి సారవంతంగా, నాణ్యమైన పంటలు పండే విధంగా పని చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమం రైతుల హృదయాలను గెలుచుకుందని. నాణ్యమైన విత్తనాలు తక్కువ ధరకు లభించడం వల్ల రైతుల్లో కొత్త ఉత్సాహం కనిపిస్తోంది. ఈ పథకం భవిష్యత్తులో రైతుల ఆదాయాన్ని పెంచే మార్గాన్ని సులభంగా చేస్తుందని రైతులు అభిప్రాయపడుతున్నారు. ఇది కేవలం విత్తనాల పంపిణీ కాదు ఇది భూమిలో భరోసా నాటిన పునాది. రైతు ఆశలకి కూటమి ప్రభుత్వం ఇచ్చిన విశ్వాసం అని అన్నారు. ఈ కార్యక్రమంలో పైడిమర్రి కిరణ్ కుమార్ రెడ్డి, పోతురాజు బాలకృష్ణ, సుబ్బారావు,కంభంపాటి సత్యనారాయణ,, రైతులు పాల్గొన్నారు.

# మహానాడుకు భారీగా తరలిన తెలుగుదేశం శ్రేణులు



**అవనిగడ్డ మేజర్ న్యూస్ :** కడపలో జరుగుతున్న మహానాడు కార్యక్రమానికి అవనిగడ్డ నియోజకవర్గం నుంచి భారీగా తెలుగుదేశం శ్రేణులు బొబ్బా గోవర్ధన్ నేతృత్వంలో తరలివెళ్లారు.. బుధవారం రాత్రి అవనిగడ్డ నియోజకవర్గంలోని ఆరు మండలాల నుంచి ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన 10 బస్సుల లో 500 మంది కార్యకర్తలు తరలివెళ్లగా అంతకు ముందు దాదాపు 40 కార్లలో కార్యకర్తలు కడపకు తరలి వెళ్ళి మూడు రోజుల పాటు మహానాడు కార్యక్రమంలో పాల్గొన్నారు.. కడప వెళ్లిన కార్యకర్తలకు నారాయణ మహిళా కళాశాలలో వసతి ఏర్పాట్లు చేయగా బొబ్బా గోవర్ధన్ వారిని కలసి కావలిసిన ఏర్పాట్లు పర్యవేక్షించారు. అనంతరం భారీ ర్యాలీగా మహానాడుకు బయలుదేరగా గోవర్ధన్ జండా ఊపి ర్యాలీని ప్రారంభించారు.. ఈ సందర్భంగా దివి మార్కెట్ కమిటీ చైర్మన్ కొల్లూరి వెంకటేశ్వరరావు, టీడీపీ నేతలు బండె శ్రీనివాసరావు, కర్రా సుధాకర్, నిడమానూరి దిలీప్ కుమార్, పరిసె చలపతి తదితరులు బొబ్బా గోవర్ధన్ పార్టీకోసం చేస్తున్న కృషిని కొనియాడారు.. దాదాపు దశాబ్దం న్నర తరువాత అవనిగడ్డ నుంచి ఈ స్థాయిలో కార్యకర్తలు మహానాడు కార్యక్రమానికి తరలి వెళ్లారని బొబ్బా గోవర్ధన్ నాయకత్వాన్ని నియోజకవర్గానికి చెందిన తెలుగుదేశం శ్రేణులు అన్నీ ఆమోదిస్తున్నాయి అని అన్నారు.. ఈ కార్యక్రమంలో మేడికొండ విజయ్, కోట సాయి, మేడికొండ విజయ్ ముప్పరాజు సందీప్ తదితరులు పాల్గొన్నారు.. ఈ సందర్భంగా తెలుగుదేశం పార్టీకి రూ 10 లక్షలు విరాళం ఇవ్వడంతో పాటు ఆరు మండలాల నుంచి మహానాడు కార్యక్రమానికి వెళ్లే వారి కోసం ప్రత్యేకంగా హైటెక్ బస్సులు, ఇతర వాహనాలను ఏర్పాటు చేసిన గోవర్ధన్ ను అభినందించారు.





## దత్తత తీసుకున్న తల్లిదండ్రులు, చిన్నారి హర్షిని పోషణ, సంరక్షణకు బాధ్యత వహించాలి

### డీఆర్ఓ అధికారి కే. చంద్రశేఖర రావు

**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** చిన్నారి హర్షిని పోషణ, సంరక్షణకు బాధ్యత వహించాలని దత్తత తీసుకున్న తల్లిదండ్రులను కోరిన డిఆర్ఓ గురువారం కలెక్టరేట్ లోని వారి చాంబర్‌లో దత్తత కోసం దరఖాస్తు చేసుకున్న తెలంగాణ రాష్ట్రం వరంగల్ జిల్లాకు చెందిన రాంబాబు సబిత దంపతులకు హర్షినిని జిల్లా రెవెన్యూ అధికారి కే. చంద్రశేఖర రావు అప్పగించారు. ఈ సందర్భంగా డిఆర్ఓ మాట్లాడుతూ దత్తత కోసం దరఖాస్తు చేసుకున్న ఆ దంపతులకు కేంద్ర ప్రభుత్వ దత్తత అధికృత సంస్థ- కారా అనుమతి లభించడంతో నేడు ఆ చిన్నారిని దత్తత ఇవ్వటం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ పిడి ఎంఎన్ రాణి,డిసిపియు,శిశుగృహ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

## రక్తదానం మీరు చేయండి.. మీ మిత్రులతో చేయించండి

### తహసీల్దార్ అనిల్



**పెడన మేజర్ న్యూస్ :** కృష్ణా జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు శుక్రవారం ఉదయం 9:30 గంటలకు పెడన మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో రక్తదాన శిబిరం నిర్వహించనున్నట్లు తహసీల్దార్ కూనప రెడ్డి అనిల్ కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా తహసీల్దార్ అనిల్ మాట్లాడుతూ రక్తదానం ఒక గొప్ప మానవీయ సేవ ప్రతి ఒక్కరూ ముందుకు వచ్చి పాల్గొనాలి అని పిలుపునిచ్చారు. మండలంలోని అన్ని ప్రభుత్వ శాఖల ఉద్యోగులు, గ్రామాల యువత, ఆసక్తిగల ప్రజానీకం ఈ శిబిరంలో పాల్గొనాలని కోరారు. రక్తదానం మీరు చేయండి మీ మిత్రులతో చేయించండి అనే నినాదంతో నిర్వహించబోయే ఈ శిబిరం, అత్యవసర పరిస్థితుల్లో అవసరమైనవారికి ప్రాణదాయకంగా మారవచ్చని ఆయన అన్నారు. రక్తదాత - ప్రాణదాత అనే స్ఫూర్తిదాయక సందేశంతో జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు నిర్వహించబోయే ఈ శిబిరాన్ని విజయవంతం చేయడంలో ప్రతి ఒక్కరూ తమ వంతు పాత్ర పోషించాలని తహసీల్దార్ అనిల్ పిలుపునిచ్చారు.

## 31న చలో వరంగల్ కార్యక్రమాన్ని విజయవంతం చేయండి

### యం ఎస్ పి జిల్లా అధ్యక్షుడు సిద్దెల జయరాజుమాదిగ



**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** మాన్యశ్రీ మందకృష్ణ మాదిగ రాష్ట్రపతి చేతుల మీదుగా ఈ నెల 27న పద్మశ్రీ అవార్డు తీసుకోవడం జరిగిందని అవార్డు తీసుకుని ఈనెల 31న వరంగల్ వచ్చుచున్న సందర్భంగా యం ఎస్ పి, యం ఆర్ పి ఎస్, యం ఈ ఎఫ్ నాయకులు, కార్యకర్తలు వేలాదిగా తరలివచ్చి మందా కృష్ణ మాదిగకి ఘన స్వాగతం పలుకటకు రావలసినదిగా పిలుపునిచ్చారు. యం ఈ ఎఫ్ లీగల్ అడ్వైజర్ అద్దేపల్లి నిరంజనరావు, యం ఆర్ పి ఎస్ మచిలీపట్నం నియోజకవర్గ అధ్యక్షుడు కొక్కిలిగడ్డ చిట్టిబాబు, మట్ట జయప్ర కాష్, యం ఈ ఎఫ్ కృష్ణాజిల్లా అధ్యక్షులు దేవరపల్లి విక్టర్ బాబు, వర్కింగ్ ప్రెసిడెంట్ బొకినాల కృష్ణ, ప్రధాన కార్యదర్శి బీడెల్లి మరియ కుమార్, యం ఈ ఎఫ్ కోశాధికారి రాచపూడి బాలస్వామి బండారు సోమేశ్వరరావు గంధ్రపు శీనయ్య మాస్టర్, కొడమంచిలి చంద్రశేఖర రావు తదితరులు పాల్గొన్నారు

# నగర పాలక సంస్థ ఉద్యోగులకు యోగ శిక్షణ తరగతులు



### యోగతో మానసిక, శారీరక రుగ్మతలు మటుమాయం అవుతాయి

### నగరపాలక సంస్థ కమిషనర్ బాపిరాజు

**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** యోగతో మానసిక,శారీరక రుగ్మతలు మటుమాయం అవుతాయని మచిలీపట్నం నగరపాలక సంస్థ కమిషనర్ బాపిరాజు అన్నారు. మచిలీపట్నం నగర పాలక సంస్థ కార్యాలయం సమావేశపు హాలులో గురువారం ఉదయంయోగ శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ శిక్షణ తరగతులనుకమీషనర్ బాపిరాజుప్రారంభించి ప్రసంగించారు. యోగాంధ్ర కార్యక్రమంలోభాగంగా నిర్వహిస్తున్న కార్యక్రమంలో ఉద్యోగుల తో పాటు ఉపాధ్యాయులునగరంలోని యువతీ యువకులు,డ్వాక్రా మహిళలు, నగర ప్రముఖులు పాల్గొనాలన్నారు. యోగాంధ్ర యాప్ లోనగరంలోని ప్రతి ఒక్కరూతమ పేర్లను ఆన్ లైన్ లో రిజిస్టర్ చేసుకోవాలన్నారు. యోగ మాస్టర్ ముదిగొండ శాస్త్రి మాట్లాడుతూ, శనివారం ఉదయం మునిసిపల్ ప్రధాన పార్కులో జరగనున్న యోగ శిక్షణ తరగతులలో సచివాలయ ఉద్యోగులతో పాటు నగర ప్రముఖులు పాల్గొంటా రన్నారు. ఈ కార్యక్రమంలో యోగ మాస్టర్‌లు మద్దాల చింతయ్య, ముదిగొండ శాస్త్రి శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈకార్యక్రమంలోఅయ్యప్ప, ప్రసాద్,కుముద్వని తదితరులు మాట్లాడారు... కపాలభాతి, భ్రామరీ ప్రాణాయామం, ధ్యానం చేయించారు.



# ఎమ్మెల్యే మండలి బుద్ధ ప్రసాద్‌తో బండి రామకృష్ణ భేటీ





**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధ ప్రసాద్ ను వారి నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసిన మచిలీపట్నం జనసేన పార్టీ ఇంచార్జ్ కృష్ణాజిల్లా కో-ఆపరేటివ్ మార్కెటింగ్ సొసైటీ చైర్మన్ బండి రామకృష్ణ అనంతరం ఇరువురు నాయకులు రాష్ట్ర రాజకీయాలపై కొద్దిసేపు మాట్లాడుకున్నారు. మచిలీపట్నంలో జరుగు బీచ్ ఫెస్టివల్‌లో రాష్ట్ర అధ్యక్షులు పవన్ కళ్యాణ్ నటించిన హరిహర వీరమల్లు ప్రమోషన్ లో భాగంగా నిర్మాత, డైరెక్టర్, హీరోయిన్ తో పాటు చిత్ర బృందం రాకను బీచ్ ఫెస్టివల్ లో జరుగు ఏర్పాట్లను బండి రామకృష్ణ బుద్ధ ప్రసాద్‌కు వివరించారు. అనంతరం బండి రామకృష్ణను శాలువాతో సత్కరించి రైతులకు సేవ చేసే అవకాశం కూటమి ప్రభుత్వంలో రామకృష్ణకు రావడం పట్ల బుద్ధ ప్రసాద్ అభినందనలు తెలిపారు. తన సహకారం ఎప్పుడూ ఉంటుందని రైతు సంక్షేమం కోసం కృషి చేయాలని బుద్ధ ప్రసాద్ తెలిపారని బండి రామకృష్ణ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బుద్ధ ప్రసాద్ తనయుడు యువ నాయకులు మండలి వెంకట్రామ్ అవనిగడ్డ నాయకులు మచిలీపట్నం జనసేన పార్టీ నగర అధ్యక్షుడు గడ్డంరాజు, నీటి సంఘ అధ్యక్షులు శాయన శివయ్య,కోటి, మైఖేల్, కోన ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.

## సాగునీటి సరఫరాకు టీడీపీ ప్రభుత్వం ఎల్లప్పుడు కృషి



**నందిగామ, మే 29, మేజర్ న్యూస్:** సాగునీటి సమస్యలకు ఎల్లప్పుడూ టిడిపి ప్రభుత్వం ముందుంటుందని డి సీ చైర్మన్ రాటకొండ చంద్రశేఖర్ అన్నారు. గురువారం పత్రిక పర్యటన ద్వారా తెలుపుతూ వేదాద్రి ఎత్తిపోతల పథకం 2004 లో స్వర్గీయ దేవినేని రమణ ఈ ప్రాంత రైతుల బాధలు చూసి ఎంతో ప్రతిష్టాత్మకంగా ఈ కంచల వేదాద్రి ఎత్తిపోతల పథకానికి రూపకల్పన చేశారు. ఆయన అకాల మరణం తర్వాత వచ్చిన ఆయన సోదరుడు దేవినేని ఉమా దానిని పూర్తి చేసి ఈ ప్రాంత రైతాంగానికి 17వేల ఎకరాలకు నీరు అందించింది. ఎన్ని అవాంతరాలు ఎదురైనా ఈ స్కీమ్ 15 సంవత్సరాలు నిర్విరామంగా పనిచేసి రైతులకు లబ్ధి చేకూర్చింది. గత ప్రభుత్వం హయాంలో ఈ స్కీమ్ ను పూర్తిగా నిర్వీర్యం చేసి మోటార్లు తుప్పుపట్టి మొత్తం స్కీమ్ శిధిలావస్థకు చేకూర్చింది.

మన ప్రభుత్వ శాసన సభ్యురాలు తంగిరాల సౌమ్య ఈ స్కీమ్ పై ప్రత్యేక శ్రద్ధపెట్టి ఎన్నోసార్లు నీటి పారుదల శాఖమాత్యులు దగ్గరకు, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకెళ్లి పట్టుబట్టి మరి ముప్పాళ్ళ సభలో 15 కోట్లు నిధులు విడుదల చేయించటం జరిగింది. మరి ఇలాంటి ఈ పథకాన్ని రైతులకు మేలు చేయలేదు అని పోస్టులు పెట్టటం రైతులు గుర్తించరా., నేను డీసీ చైర్మన్ అయిన వెంటనే ఎన్ఎస్పి కెనాల్ స్కీమ్ డెలివరీ పాయింట్స్ కి షట్టర్లు బిగించాలని ఏపీఎస్ఐడీసీఎల్ అధికారులును కోరటం, వారు ఎస్టిమేషన్ వేసి స్పందించి త్వరగా బిగిస్తామని చెప్పడం జరిగింది. ఎన్ఎస్పి నీరు వచ్చేప్పుడు తూములకు లష్కర్లు అడ్డు పెట్టటం వారు లేని సమయంలో అటు వైపు ఉన్న రైతులు అడ్డు తొలగించి నీరు వారి పొలాలకు వాడుకుంటున్నారు.

తప్పితే ఆ నీరు కృష్ణా నదిలో కలుస్తున్నాయి అనడం తప్పుడు సమాచారాన్ని పోస్టుగా పోస్టుగా పెట్టడం ఎంతవరకు సబబు,కృష్ణానదిలో కలవాలంటే ఎంతో ఎత్తున ఉన్న కొండలును దాటుకుని నీరు కృష్ణా నదిలో కలుస్తాయా అని ప్రశ్నించారు. చిన్న చిన్న పొరపాటులు అధికారులు నిర్లక్ష్యంగా ఉంటే మీరు సూచనలు ఇవ్వవచ్చు..ఇలాంటి తప్పుడు వార్తలు ప్రచారం చేయడం భావ్యం కాదని చంద్రశేఖర్ తెలిపారు.



## తహసీల్దార్ పై విచారణకు కలెక్టర్ ఆదేశం

**జగ్గయ్యపేట మే 28 మేజర్ న్యూస్ :** మండల తహసీల్దార్ పి.మనోహర్ తన హోదాను అడ్డుపెట్టుకొని కార్యాలయంలో అనేక అవినీతి అక్రమాలు చేశాడు అనే ఆరోపణలపై స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ చేత విచారణకు ఆదేశాలు పంపినట్లు ఫిర్యాదు దారుడు జి విజయ రాజు తెలిపారు. ఈ సందర్భంగా విజయరాజు మాట్లాడుతూ జగ్గయ్యపేట తహసీల్దార్ కార్యాలయంలో రెవెన్యూ అధికారులు అనేక అవినీతి అక్రమాలకు పాల్పడుతున్నారని ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఫిర్యాదు మేరకు జూన్ 3న విచారణకు హాజరు కావలసినదిగా ఆదేశాలు ఇచ్చినట్లు ఆయన తెలిపారు.

# ఆరోగ్య ఆనంద స్వర్ణాంధ్రకు యోగాంధ్ర







**జూన్ 21 వరకు ఊరూవాడా పండగలా యోగా కార్యక్రమాలు**

**26 జిల్లాల్లోనూ 26 ఇతివృత్తాలతో థీమ్ యోగా నిర్వహణ**

**అన్ని వర్గాల ప్రజలకూ యోగాను చేరువచేసేందుకు కృషిచేస్తున్నాం**

**కనీసం రెండు కోట్లమందికి యోగాసనాలు నేర్పడం లక్ష్యంగా కార్యక్రమాలు**

**రాష్ట్ర వ్యాప్తంగా 1,25,000 మంది యోగా ట్రైనర్ల నమోదు**

**బీఆర్‌టీఎస్ యోగాంధ్ర స్ట్రీట్‌లో విజయవంతంగా పోలీస్ యోగాంధ్ర**

**ఇదే స్ఫూర్తితో కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు సమష్టిగా ముందడుగేద్దాం**

**రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్**

**ఎన్‌టీఆర్ జిల్లా బ్యూరో, మే 29, మేజర్ న్యూస్ :** ఆరోగ్య ఆనంద స్వర్ణాంధ్ర సాకారానికి రాష్ట్ర ప్రభుత్వం ముఖ్యమంత్రి ఆకాంక్షలకు అనుగుణంగా మే 21న ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన యోగాంధ్ర కార్యక్రమం ముందుకెళ్తోందని, ఇదే స్ఫూర్తితో కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు సమష్టిగా అడుగులేద్దామని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ పిలుపునిచ్చారు. ఆయుష్‌శాఖ, ఎన్‌టీఆర్ జిల్లా అధికార యంత్రాంగం, జిల్లా పోలీస్ కమిషనరేట్, విజయవాడ నగరపాలక సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో గురువారం విజయవాడ బీఆర్‌టీఎస్ యోగా స్ట్రీట్‌లో నిర్వహించిన పోలీసు థీమ్ యోగా కార్యక్రమంలో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ పాల్గొని సీనియర్ ఐఏఎస్, ఐపీఎస్ అధికారులతో కలిసి యోగాసనాలు అభ్యసించారు. అనంతరం సీఎస్ మాట్లాడుతూ ఆరోగ్యవంతమైన సంతోషకమైన సమాజ నిర్మాణం లక్ష్యంగా అంతర్జాతీయ యోగా దినోత్సవం జూన్ 21



వరకు రాష్ట్రంలోని ప్రతి గ్రామం, పట్టణంలో యోగాంధ్ర కార్యక్రమాలు జరుగుతాయని, అప్పటికి కనీసం రెండుకోట్ల మందికి యోగాను నేర్పించేలా ప్రణాళిక ప్రకారం కృషిచేస్తున్నట్లు తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా 1,25,000 మంది యోగా ట్రైనర్లు నమోదు చేసుకున్నారని, వీరి సహాయంతో ప్రజలకు యోగాపై అవగాహన కల్పించడంతో పాటు యోగాసనాలు నేర్చుకునేలా





ప్రోత్సహిస్తున్నామన్నారు. 26 జిల్లాల్లో 26 థీమ్‌లతో యోగాంధ్ర ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని.. రైతులు, కార్మికులు, ఉపాధి హామీ శ్రామికులు, సీనియర్ సిటిజన్స్, విభిన్న ప్రతిభావంతులు.. ఇలా సమాజంలోని ప్రతివర్గానికి యోగాను చేరువచేసేందుకే ఈ థీమ్ యోగాను నిర్వహిస్తున్నట్లు వివరించారు. రాష్ట్ర వ్యాప్తంగా దాదాపు 100 పర్యాటక ప్రాంతాల్లోనూ యోగా విశిష్టతను వివరించి, అవగాహన కల్పించే కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు. ఇందుకు ప్రతిజిల్లాలో నాలుగైదు చొప్పున పర్యాటక ప్రాంతాలను గుర్తించినట్లు తెలిపారు. థీమ్ యోగాంధ్రలో భాగంగా గురువారం విజయవాడ బీఆర్‌టీఎస్ యోగా స్ట్రీట్‌లో నిర్వహించిన పోలీస్ థీమ్ యోగా కార్యక్రమం విజయవంతమైందని.. ఇదే స్ఫూర్తితో యోగాంధ్ర విజయవంతానికి కృషిచేద్దామని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్ అన్నారు.

**రాష్ట్ర వ్యాప్తంగా యోగాంధ్రకు విశేష స్పందన**

**ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎం.టి.కృష్ణబాబు**

ఈ నెల 21న రాష్ట్ర వ్యాప్తంగా ప్రారంభమైన యోగాంధ్రకు విశేష స్పందన లభిస్తోందని.. అన్ని వర్గాల ప్రజలు కార్యక్రమంలో భాగస్వాములవుతూ యోగా ఔన్నత్యానికి వన్నె తెస్తున్నారని రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి (వైద్య ఆరోగ్యం, కుటుంబ సంక్షేమం) ఎం.టి.కృష్ణబాబు అన్నారు. దాదాపు అన్ని జిల్లాల్లోనూ యోగాభిలాషులు నమోదు చేసుకుంటున్నారని, కొన్ని జిల్లాల్లో లక్ష్యానికిమించి ఔత్సాహికులు రిజిస్ట్రేషన్ చేయించుకున్నట్లు వివరించారు.


భూ పరిపాలన చీఫ్ కమిషనర్, ఎన్‌టీఆర్ జిల్లా ప్రత్యేక అధికారి జి.జయలక్ష్మి మాట్లాడుతూ భారతీయ సంస్కృతి అందించిన విలువైన యోగా సంపదపై ప్రతిఒక్కరూ అవగాహన కల్పించుకొని, రోజువారీ జీవితంలో యోగాతో అనుసంధానమై సుసంపన్న జీవితాన్ని సొంతం చేసుకోవాలని సూచించారు. యోగాచరణను ఏ ఒక్క రోజుకో పరిమితం చేసుకోకుండా జీవితాంతం ఓ మంచి అలవాటుగా కొనసాగించాన్నారు.

ఎన్‌టీఆర్ జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ మాట్లాడుతూ యోగాంధ్రలో భాగంగా జిల్లా వ్యాప్తంగా ప్రతిరోజూ యోగాసనాల కార్యక్రమాలు జరుగుతున్నాయని, బీఆర్‌టీఎస్ యోగా స్ట్రీట్‌లోనూ థీమ్ యోగాను నిర్వహిస్తున్నామని, ఇప్పటికే పాత్రికేయులు, యోగా శిక్షణ సంస్థలు, ప్రభుత్వ ఉద్యోగ సంఘాల ప్రతినిధులు, వాహన చోదకులు తదితరులతో థీమ్ యోగా కార్యక్రమాలు నిర్వహించామని తెలిపారు. పర్యాటక ప్రాంతాల్లో యోగాలో భాగంగా గాంధీ హిల్‌పై యోగాసనాల అభ్యసన కార్యక్రమాన్ని నిర్వహించామన్నారు. మిగిలిన పర్యాటక ప్రాంతాల్లోనూ నిర్వహిస్తామని.. ఒక ప్రణాళిక ప్రకారం జిల్లాలో దాదాపు 15 లక్షల మందికి యోగాను చేరువచేసేందుకు కృషిచేస్తున్నామ న్నారు. ఎన్‌టీఆర్ జిల్లా పోలీసు కమిషనర్ ఎస్‌వీ రాజశేఖరబాబు మాట్లాడుతూ శారీరక ఆరోగ్యంతో పాటు మానసిక ఆరోగ్యాన్నీ సొంతం చేసే యోగా ఉపయోగాలపై ప్రజలకు అవగాహన కల్పించి, ఆచరించేలా ప్రోత్సహించే లక్ష్యంతో ప్రభుత్వం నిర్వహిస్తున్న యోగాంధ్రలో పోలీసు శాఖ భాగస్వామ్యం కావడం ఆనందంగా ఉందని పేర్కొన్నారు. గురువారం బీఆర్‌టీఎస్ యోగా స్ట్రీట్‌లో దాదాపు అయిదువేల మంది పోలీసు అధికారులు, సిబ్బంది, యోగా ఔత్సాహికులతో నిర్వహించిన పోలీసు యోగాంధ్ర విజయవంతానికి కృషిచేసిన ప్రతిఒక్కరికీ ధన్యవాదాలు తెలియజేస్తున్నామన్నారు.

**కనులవిందుగా కళాత్మక యోగా**

కార్యక్రమంలో భాగంగా చిన్నారుల ఆర్టిస్టిక్ యోగా ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. శ్వాసపై ఏకాగ్రత అనేది సర్వరోగ నివారిణిగా పనిచేస్తుందంటూ యోగా, ధ్యానం వల్ల కలిగే ప్రయోజనాలను వివరిస్తూ ఓం శాంతి బ్రహ్మకుమారీలు యోగా ఔత్సాహికులతో ధ్యాన సాధన చేయించారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్యం, కుటుంబ సంక్షేమం కమిషనర్ జి.వీరపాండ్యన్, ఆయుష్ డైరెక్టర్ కె.దినేష్ కుమార్, విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర హెచ్‌ఎం, ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ బి.రాజకుమారి, ఈగల్ ఐజీ ఆకే రవికృష్ణ, ఏపీఎస్‌పీ ఐజీ రత్నకుమారి, డీసీపీ కేజీవీ సరిత, విజయవాడ ఆర్‌డీవో కావూరి చైతన్య, జిల్లా ఆయుష్ యోగాంధ్ర నోడల్ అధికారి డా. వి.రాణి, ఆయుష్ అధికారి డా. రామత్లేహి, మెడికల్ ఆఫీసర్ డా. వై.రత్న ప్రియదర్శిని, అమరావతి యోగా, పతంజలి యోగా, ఈషా ఫౌండేషన్, ఆర్ట్ ఆఫ్ లివింగ్, ఓం శాంతి బ్రహ్మకుమారీలు, పెద్దఎత్తున యోగా ఔత్సాహికులు పాల్గొన్నారు.
















# వ్యర్థాల నుండి సంపదను సృష్టిస్తున్న చర్యల్లో ఎటువంటి అంతరాయం ఉండరాదు





**విజయవాడ కార్పొరేషన్, మేజర్ న్యూస్ :** వ్యర్థాల నుండి సంపదను సృష్టిస్తున్న చర్యల్లో ఎటువంటి అంతరాయం ఉండరాదని విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర అన్నారు. గురువారం ఉదయం తన పర్యటనలో భాగంగా అజిత్ సింగ్ నగర్ పర్యటించి గార్బేజ్ ట్రాన్స్ఫర్ స్టేషన్, అన్న క్యాంటీన్‌ను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నేషనల్ సఫాయి కర్మచారి పథకం లో భాగంగా కొత్తగా వచ్చిన ఐదు పెద్ద టిప్పర్ వాహనాలను పరిశీలించారు. లబ్ధిదారులతో పెద్ద టిప్పర్లను సాధ్యమైనంత త్వరలో అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. గార్బేజ్ ట్రాన్స్ఫర్ స్టేషన్లో వ్యర్థాల నుండి సంపద సృష్టిస్తున్న చర్యలను ఎటువంటి అంతరాయం లేకుండా చేస్తూనే ఉండాలని, ఆహ్లాదకరమైన వాతావరణాన్ని కల్పించే విధంగా ఎప్పుడు పరిశుభ్రంగా ఉంచాలని అధికారులను ఆదేశించారు. తదుపరి అజిత్ సింగ్ నగర్ వద్ద గల అన్న క్యాంటీన్ ను పరిశీలించారు సమయపాలన సక్రమంగా జరుగుతుందా లేదా అని అక్కడున్న ప్రజలను అడిగి తెలుసుకున్నారు ఆహారంలో నాణ్యత పరిశుభ్రతాపరిశుధ్య నిర్వహణ తదితర అంశాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అన్నా క్యాంటీన్లో వస్తున్న ప్రజలు తమ అభిప్రాయాలను క్యూఆర్ కోడ్ ద్వారా ఫీడ్బ్యాక్ను తెలియచేయొచ్చునని తెలిపారు. ఈ పర్యటనలో చీఫ్ ఇంజనీర్ ఆర్ శ్రీనాథ్ రెడ్డి, ఇంచార్జ్ చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ గోపాలకృష్ణ నాయక్, వెహికల్ డిపో ఇన్చార్జ్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఏసు పాదం, తదితరులు పాల్గొన్నారు.

# డిస్ట్రిక్ట్ ఎలక్షన్ గోడౌన్‌కు పటిష్ట భద్రత







**విజయవాడ, మేజర్ న్యూస్ :** డిస్ట్రిక్ట్ ఎలక్షన్ గోడౌన్‌కు పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేయడం జరిగిందని, అనునిత్యం అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ డా.జి.లక్ష్మీశ అధికారులను ఆదేశించారు. ఎన్నికల కమీషన్ ఆదే శాల మేరకు సాధారణ తనిఖీలలో భాగంగా విజయవాడ రూరల్ గొల్ల పూడిలోని ఈవీఎం, వీవీప్యాట్లను భద్ర పరిచే డిస్ట్రిక్ట్ ఎలక్షన్ గోడౌన్‌ను గురు వారం జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ అధికారులు, రాజకీయ పార్టీల ప్రతినిధు లతో కలిసి పరిశీలించారు. సీసీ కెమెరాల పనితీరు, అగ్నిమాపక దళ పరికరా ల ఏర్పాటను పరిశీలించారు. అనంతరం పర్యవేక్షణ రిజిస్టర్‌లో సంతకం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ భారత ఎన్నికల సంఘం (ఈసీఐ) మార్గదర్శకాలకు అనుగుణంగా ఈవీఎం, వీవీప్యాట్లను భద్రపరుస్తున్న డిస్ట్రిక్ట్ ఎలక్షన్ గోడౌన్‌ను ఎప్పటికప్పుడు క్షుణ్ణంగా తనిఖీ చేసి సమగ్ర నివేదికను అందించడం జరుగుతుందన్నారు. గోడౌన్ వద్ద విధులు నిర్వహిస్తున్న పోలీస్ సిబ్బంది ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉంటూ సీసీ కెమెరాల పర్యవేక్షణతో గట్టి నిఘా ఉంచాలన్నారు. తనిఖీ ప్రక్రియలో డీఆర్వో ఎం.లక్ష్మీ నరసింహం, వై రామయ్య( టీడీపీ), తరుణ్ కాకాని (బిజేపి) కె. పరమేశ్వర రావు (ఏఏపి) కలెక్టరేట్ ఎలక్షన్ సెల్ సూపరింటెండెంట్ సలీమ్ ఉన్నారు.



## మే 31 శనివారం ఎన్టీఆర్ భరోసా పెన్షన్స్ పంపిణీ

**గుడ్లవల్లేరు మేజర్ న్యూస్ :** గుడ్లవల్లేరు మండలంలో జూన్ నెలకు ఎన్టీఆర్ భరోసా పెన్షన్స్ 6929కు రూ.3,01,86,500/-లు విడుదల చేయడం జరిగినదని మండల పరిషత్ అభివృద్ధి అధికారి టి. విజయసారధి తెలిపారు. జూన్ 1 వ తేదీ ఆదివారం కాబట్టి మే 31 వ తేది ఉదయం 6.30 గంటలకు గుడ్లవల్లేరు మండలంలో అన్ని సచివాలయాల్లో ఎన్టీఆర్ భరోసా పెన్షన్స్ పంపిణీ ప్రారంభించడం జరుగుతుందన్నారు. అలాగే రేపు 30.05.2025వ తేదీ శుక్రవారం పెన్షన్ ఎమౌంట్ మండలంలోని అన్ని సచివాలయ ఎకౌంట్స్‌కు జమ చేయడం జరుగుతుందని ఎంపిడిఓ విజయసారధి తెలియచేసారు. కాబట్టి ఎన్టీఆర్ భరోసా పెన్షను లబ్ధిదారులందరూ మే 31 శనివారం తమ పెన్షన్లు పొందుకోవచ్చు.

# చెట్లపైనుండి పడిపోయిన గీతకార్మికులను ఆదుకోండి

**రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసిన కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు వాకా రామచంద్రరావు**

**పామర్తి సత్యనారాయణ(దేశాయిగుంట, గుడ్లవల్లేరు)ను పరామర్శించిన రామచంద్రరావు**



**గుడ్లవల్లేరు మేజర్ న్యూస్ :** కల్లు గీత కార్మికుల నష్టపరిహారం విషయంలో కూటమి ప్రభుత్వం విధివిధానాలు ప్రకటించనందున అయోమయానికి గురవుతున్నామని ఆంధ్రప్రదేశ్ కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు వాకా రామచంద్రరావు అన్నారు. గుడ్లవల్లేరు మండలం వెణుతురుమిల్లి శివారు దేశాయిగుంట గ్రామంలో చెట్టు పై నుండి పడిపోయి లేవలేని పరిస్థితిలో మంచం మీద వున్న పామర్తి సత్యనారాయణను గురువారం రాష్ట్ర కల్లు గీత కార్మిక సంఘం అధ్యక్షులు వాకా రామ చంద్రరావు పరామర్శించారు. ఈ సంద ర్భంగా రామచంద్రరావు మాట్లాడుతూ గతంలో చెట్ల పైనుండి పడిపోయిన వారికీ మూడు కేటగి రిలుగా అనగా 1)చనిపోయిన వారు 2)పూర్తి వికలాంగులు 3)తాత్కాలిక వికలాంగులుగా ఎక్సైజ్ జిల్లా సూపరింటెండెంట్‌ల ద్వారా ఎంక్వయిరీ చేయించి నష్టపరిహారం మంజూరుచేసేవారనీ, కానీ నేడు ఆ పథకం ఉందో లేదో తెలియని అయోమయ స్థితి వుందన్నారు. అలాగే ఇటీవల గౌడ కార్పొరేషన్ చైర్మన్ వీరంకి గురుమూర్తి ఒక ప్రకటనలో గీత వృత్తి చేస్తూ చెట్ల పైనుండి పడి మరణించిన వారికీ 5 లక్షలు, వికలాంగులకు 2 లక్షలు మా ప్రభుత్వం ఇస్తుందని ప్రకటించారనీ, కానీ విధి విధానాలు ప్రకటించలేదన్నారు. ఇటీవల కృష్ణాజిల్లాలో కోడూరు మండలంలో ఉల్లిపాలెం గ్రామంలో ఉప్పాల యేసు చెట్టు పైనుండి పడి మరణించాడని, కోడూరు గ్రామం శివారు స్వతంత్ర పురంలో మోర్ల కోటేశ్వరరావు వికలాంగుడైనాడని, గుడ్లవల్లేరు మండలం దేశాయి గుంట గ్రామంలో పామర్తి సత్యనారాయణ చెట్టు పైనుండి పడి లేవలేని పరిస్థితిలో మంచం మీద వున్నాడన్నారు. యిలా ఎంతోమంది గీత కార్మికులు రాష్ట్ర వ్యాప్తంగా తాడి చెట్ల పై నుండి పడి పోయి నష్ట పరిహారం అందక దిక్కుతోచని పరిస్థితిలో వున్నారనీ, గతంలో మాదిరిగా ఎక్సైజ్ శాఖ ద్వారా విధివిధానాలు ప్రకటించి తగిన నష్టపరిహారం అందచచేసి వారి కుటుంబాలను ఆదుకోవలసినదిగా రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరుతున్నామని వాకా రామచంద్రరావు పేర్కొన్నారు. దేశాయిగుంట సొసైటీ అధ్యక్షులు కాగిత వీర నాంచారయ్య పాల్గొన్నారు.



## శ్రీ అభయాంజనేయ స్వామి ఆలయం వద్ద హనుమజ్జయంతి వేడుకలు



**పెడన,మేజర్ న్యూస్ :** హనుమజ్జయంతి సందర్భంగా స్థానిక తోటమూల సెంటర్లో వేంచేసియున్న శ్రీ అభయాంజనేయ స్వామి ఆలయం వద్ద తెల్లవారుజాము నుండి ప్రత్యేక పూజాది కార్యక్రమాలు హోమాలు నిర్వహించి భారీ అన్న సమారాధన చేశామని ఆలయ అర్చకులు పృద్వి నాగరాజు తెలిపారు. ఈ మేరకు మచిలీపట్నం వాస్తవ్యులు జొన్నల వరప్రసాద్ వెంకట దుర్గా దంపతులచే ప్రత్యేక హోమాలు పూజాది కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ వారు ఒక ప్రకటనలో మాట్లాడుతూ హనుమజ్జయంతి సందర్భంగా ఈనెల 21 నుండి 29 వరకు ప్రతిరోజు స్వామి వారికి ఏకాదశ మన్యు సూక్తముతో అభిషేకాలు విశేష అర్చనలు నిర్వహించామని తెలిపారు. మహిళలు పిల్లలు పెద్దలు తెల్లవారుజామునుండే స్వామివారి నీ దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారన్నారు. అనంతరం సుమారు 6 వేల మందికి అన్న సమారాధన కార్యక్రమాన్ని నిర్వహించామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానికులు, ఆలయ కమిటీ సభ్యులు ఉన్నారు.

## వెహికల్ డిపోలో అగ్ని ప్రమాద నిరోధక అవగాహన



**విజయవాడ కార్పొరేషన్, మేజర్ న్యూస్ :** నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర ఆదేశాల మేరకు అగ్ని ప్రమాదాలను నిరోధించడానికి గురువారం ఉదయం వేహికాల్ డిపో, గవర్నర్‌పేట లో అగ్ని ప్రమాద నిరోధక అవగాహన కార్యక్రమం నిర్వహించారు వి యం సి ఫైర్ సిబ్బంది. ఈ కార్యక్రమంలో అగ్ని ప్రమాదం జరగకుండా ఉండేందుకు తీసుకోవాల్సిన నిరోధక చర్యలు, అగ్ని ప్రమాద నిరోధక పరికరాలను ఉపయోగించు విధానం, అగ్ని ప్రమాదం జరిగినప్పుడు మంటలను ఎలా అర్పాలి, ఎటువంటి పరికరాలను ఉపయోగించాలి, ఫైర్ స్ప్రింక్లర్స్, స్మోక్ డిటెక్టర్స్, ఎక్కడెక్కడ అమర్చాలి, వాటి వలన స్మోక్ అలారం ఎలా వస్తుంది, అగ్ని ప్రమాదం జరగకుండా డిపో చుట్టూ ఫైర్ సేఫ్టీ మెజర్స్ ఏమేం ఉండాలి వంటి విషయాలపై వారికి అవగాహన కల్పించారు. అగ్ని ప్రమాదం జరిగితే ఫైర్ ఎక్సటింగుషేర్ వాడి, మంటలను ఎలా ఆర్పాలి, వంటి విషయాలపై వెహికల్ డిపో సిబ్బంది చే చేయించారు. ఈ కార్యక్రమంలో వెహికల్ డిపో ఇంచార్జి ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ యేసుపాదం, రీజినల్ ఫైర్ ఆఫీసర్ వెంకటేశ్వరరావు, స్టేషన్ ఫైర్ ఆఫీసర్ రాజా, వెహికల్ డిపో సిబ్బంది పాల్గొన్నారు.

18 వసంతాల 'సూర్య' మహాయజ్ఞంలో 'సూర్య'
అక్షర సైనికుల భాగస్వామ్యంతో అనితర సాధ్యం కాని
ఎన్నో లక్ష్యాలను అధిగమించింది. ఈ ప్రస్థానంలో
సూర్యాక్షరంతో మమేకమైన 'సూర్య' కుటుంబ
సభ్యులందరికీ అక్షర నమస్సులు. మాకు తోడుగా
నిలుస్తున్న పాఠకులకు, మిత్రులకు, శ్రేయోభిలాషులకు
పేరుపేరున కృతజ్ఞతాభివందనాలు.

ఇట్లు: ఎన్.వెంకట్, ఎన్టీఆర్ - కృష్ణా బ్యూరో
ఫోన్ : 9642 980 999